RNI No - APTEL/2022/81596

janodaya

# జనోదయ

కరీంనగర్ గురువారం 28.05.2026 సంపుటి : 03 సంచిక : 169 పేజీలు : 08 వెల : రూ.5

తెలుగు దినపత్రిక

Karimnagar Thursday 28.05.2026 Volume: 03 Issue 169 Pages 08 Cost 5/

మెరుగైన పాత్రికేయం కోసం..జర్నలిస్టుల హక్కుల సాధనకు
బలమైన గొంతుకగా ఉన్న సీనియర్ జర్నలిస్ట్
మానసాని కృష్ణా రెడ్డి జాతీయ అధ్యక్షులుగా ఉన్న
జర్నలిస్టుల సంక్షేమ సంఘం (జెఎస్ఎస్)లో నేడే సభ్యులుగా చేరండి..చేర్పించండి
వాట్సాప్ చేయండి:8074124190
జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Regd.No. 914/2015
JSS
JOURNALISTS SANKSHEMA SANGAM
TELANGANA ANDHRAPRADESH TRADE UNION
మానసాని కృష్ణా రెడ్డి , జెఎస్ఎస్ జాతీయ అధ్యక్షులు ,9618616110

# 2029 ఎన్నికల్లో మహిళలకు 33శాతం సీట్లు

**మహానాడులో చరిత్రాత్మక తీర్మానం**

**ఇది మా సంకల్పం.. బాధ్యత.. కమిట్‌మెంట్**

**మహిళలు కేవలం లబ్ధిదారులుగా మిగిలిపోకూడదు**

**వారు విధాన నిర్ణేతలు కావాలి.. ఇదే టీడీపీ లక్ష్యం**



**అమరావతి, మే 27 :** 'పార్లమెంటులో మహిళా బిల్లు పెడితే ప్రతిపక్షాలు అడ్డుకున్నాయి. మన స్త్రీ శక్తికి మరింత బలం ఇవ్వాలని చూస్తే దానికి ప్రతిపక్షాలు అడ్డుపడ్డాయి. పార్లమెంటులో బిల్లు పాస్ అయినా, కాకపోయినా మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి. 2029 సార్వత్రిక ఎన్నికల్లో 33 శాతం సీట్లు మహిళలకు ఇవ్వాలి. ఈ పవిత్ర మహానాడు వేదిక నుంచి ఈ ప్రతిపాదన చేస్తున్నా' అని టీడీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి లోకేశ్ ప్రకటించారు. ఈ చరిత్రాత్మక తీర్మానంతో మహానాడు వేదిక చప్పట్లతో మార్మోగింది. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రారంభమైన మహానాడులో లోకేశ్ మాట్లాడారు. '2029 సార్వత్రిక ఎన్నికల్లో మహిళలకు 33 శాతం సీట్లను కేటాయించాలి. ఇది భారతదేశ భవిష్యత్తు పట్ల టీడీపీకి ఉన్న నిబద్ధత. మనకు మరింత మంది మహిళా చట్టసభ సభ్యులు కావాలి. మహిళా విధాన నిర్ణేతలు కావాలి. టీడీపీ భవిష్యత్తును మహిళలు భుజం భుజం కలిపి నడిపిస్తారు. ఇది మా సంకల్పం.. బాధ్యత.. కమిట్‌మెంట్' అని అన్నారు. భారత రాజకీయాల్లో తదుపరి శకం మహిళా నాయకత్వానిదే కావాలని తాను బలంగా విశ్వసిస్తున్నానని లోకేశ్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకురావడం ద్వారా ఎన్డీయే ఒక చరిత్రాత్మక అడుగు వేసిందన్నారు. 'మహిళలు కేవలం లబ్ధిదారులుగా మిగిలిపోకూడదు. నిర్ణయాలు తీసుకునే వారుగా మారాలి. దురదృష్టవశాత్తు ప్రతిపక్ష పార్టీలు మహిళా బిల్లును తిరస్కరించి, మహిళా సాధికారతకు అడ్డంకులు సృష్టించడానికి ప్రయత్నించాయి. ఎన్నికల సమయంలో చాలా పార్టీలు మహిళా సాధికారత గురించి మాట్లాడుతాయి. ఎన్నికల తర్వాత మహిళలను మర్చిపోతాయి. కానీ టీడీపీ ఆచరణలో మహిళా సాధికారతను (మిగతా 5లో.)

# 30న కర్ణాటకకు కొత్త సీఎం

## నేడు సిద్ధరామయ్య రాజీనామా?

**సాయంత్రం 3 గంటలకు గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరిన సీఎం**

**ముఖ్యమంత్రిగా డీకేకు అవకాశం**



**బెంగళూరు, మే 27 :** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేడు గురువారం(మే 28) సాయంత్రం 3 గంటలకు తన పదవికి రాజీనామా చేయనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. తన రాజీనామా సమర్పించడానికి గురువారం సాయంత్రం 3 గంటలకు ఆయన రాష్ట్ర గవర్నర్ తావర్ చంద్ గెహ్లాట్ అపాయింట్‌మెంట్ కోరినట్లు వర్గాలు తెలిపాయి. న్యూఢిల్లీలో మంగళవారం కాంగ్రెస్ అధిష్ఠాన వర్గంతో జరిగిన ఉన్నత స్థాయి చర్చల అనంతరం ఊహించిన ఈ చర్య ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రి పదవిని చేపట్టడానికి మార్గం సుగమం చేయనున్నది. కాగా, ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్లు సిద్ధరామయ్య తనకు చెప్పారని కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే ఆర్‌వీ దేశ్‌పాండే కూడా బుధవారం ధృవీకరించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి పదవి కోసం సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య అధికార పోరు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ మార్పు జరగనున్నది.కర్ణాటక ముఖ్యమంత్రిగా ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మే 30న ప్రమాణం చేసే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి డీకేకు పార్టీ అధిష్ఠానం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చినట్లు తెలుస్తున్నది.

# ప్రతీ గ్రామానికి టీ-ఫైబర్ నెట్

**కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో సీఎం వీడియో కాన్ఫరెన్స్**



**హైదరాబాద్, మే 27:** రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి, ఇంటికి హై-స్పీడ్ ఇంటర్నెట్ అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం టీ-ఫైబర్ ప్రాజెక్టు వేగవంతంపై దృష్టి సారించింది. అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ (ఏబీపీ) కింద ఈ ప్రాజెక్టు అమలు చేయాలని అనుకుంటుంది. ఇందుకు సంబంధించి కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు సహా ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఏబీపీ అమలు ప్రక్రియను సజావుగా ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకువెళ్లారు. ముఖ్యంగా కేంద్రంతో ఒప్పందాన్ని త్వరగా కుదుర్చుకోవడం, పెండింగ్‌లో ఉన్న నిధుల విడుదల వేగవంతంపై మాట్లాడారు. అలాగే మండలం నుంచి గ్రామ పంచాయతీ స్థాయిలో ఉన్న రింగ్ నెట్‌వర్క్ ఆస్తులను డిజిటల్ భారత్ నిధికి బదిలీ చేసే విషయంలో స్పష్టమైన విధానం అవసరమని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి సింధియా రాష్ట్రానికి అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కాగా, ఈ ప్రాజెక్టులో రింగ్ ఆర్కిటెక్చర్ విధానాన్ని అమలు చేయడం ద్వారా ఒక మార్గంలో అంతరాయం ఏర్పడినా ప్రత్యామ్నాయ మార్గం ద్వారా సేవలు నిరంతరం కొనసాగించేలా వ్యవస్థను రూపుదిద్దుతున్నారు. దీని వల్ల గ్రామీణ ప్రాంతాల్లో కూడా నిరంతర హై-స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. మొదటి దశలో ఉమ్మడి నిజామాబాద్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల్లో నెట్‌వర్క్ దెబ్బతిన్న 3,089 గ్రామాలకు డిజిటల్ కనెక్టివిటీ పునరుద్ధరణ చేపట్టనున్నారు. ఈ క్రమంలో టీ-ఫైబర్ అమలుకు స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. టీఫైబర్ ప్రాజెక్ట్ విస్తరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఇప్పటివరకు రూ.3721.60 కోట్లు ఖర్చు చేశారు. అయితే ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కేంద్రం పలు అంశాలపై సూచనలు, అభ్యంతరాలు వ్యక్తం చేయగా.. రాష్ట్రం కేంద్రానికి పలు విజ్ఞప్తులు చేసినట్లు తెలుస్తోంది.

# మాపై ఏపీ పెత్తనమేంది?




4లో..

**ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై అక్రమ కేసులు సహించం**

# వారెవ్వా..వైభవ్ వీరబాదుడు

**29 బంతుల్లో 97 పరుగులు**

**త్రుటిలో రికార్డు శతకం మిస్**

**కూల్చేసిన ఆర్చర్**

**ఎలిమినేటర్‌లో రాజస్థాన్ గెలుపు**

**సన్‌రైజర్స్ అవుట్**



**ముల్లన్‌పూర్:** టీనేజ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ (29 బంతుల్లో 5 ఫోర్లు, 12 సిక్స్‌లతో 97) విధ్వంసక ఇన్నింగ్స్‌కుతోడు పేసర్ జోఫ్రా ఆర్చర్ (3/58) నిప్పులు చెరగడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను రాజస్థాన్ రాయల్స్ నాకౌట్ చేసింది. బుధవారం ఏకపక్షంగా సాగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాజస్థాన్ 47 పరుగులతో గెలిచింది. శుక్రవారం జరిగే ఐపీఎల్ క్వాలిఫయర్-2లో గుజరాత్ టైటాన్స్‌తో రాజస్థాన్ అమీతుమీ తేల్చుకోనుంది. తొలుత రాజస్థాన్ 20 ఓవర్లలో 243/8 స్కోరు చేసింది. ధ్రువ్ జురెల్ (21 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 50) అర్ధ శతకం సాధించాడు. ప్రఫుల్ హింగే 3 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో హైదరాబాద్ 19.2 ఓవర్లలో 196 పరుగులకే కుప్పకూలింది. నితీశ్ కుమార్ (38), సలీల్ అరోరా (35), ఇషాన్ కిషన్ (33) మినహా ఎవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. జడేజా, సుశాంత్ మిశ్రా, బర్గర్ తలో రెండు వికెట్లు తీశారు. సన్‌రైజర్స్ పనిబట్టిన వైభవ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. భారీ హిట్టర్లున్న సన్‌రైజర్స్.. ఛేదనలో ఘోరంగా తడబడింది. ప్రత్యర్థి బ్యాటర్లు చెలరేగిన చోట.. పెవిలియన్‌కు క్యూ కట్టింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ (0), హెడ్ (17)తోపాటు ఇషాన్‌ను కూడా అవుట్ చేసిన ఆర్చర్.. సన్‌రైజర్స్ బ్యాటింగ్ వెన్నువిరిచాడు. ఇన్నింగ్స్ రెండో బంతికే అభిషేక్ డకౌటైనా.. వన్‌డౌన్‌లో వచ్చిన ఇషాన్ ఎడాపెడా షాట్లతో స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. అయితే, మూడో ఓవర్‌లో రెండు సిక్స్‌లు, బౌండ్రీతో చెలరేగుతున్న కిషన్‌ను కూడా జోఫ్రా వెనక్కి పంపాడు. స్మరణ్ (1)ను బర్గర్ అవుట్ చేయగా.. ఐదో ఓవర్‌లో హెడ్‌ను ఆర్చర్ బౌల్డ్ చేయడంతో హైదరాబాద్ 57/4తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆదుకొంటాడనుకొన్న క్లాసెన్ (18)ను యశ్ ఎల్బీగా వెనక్కిపంపాడు. ఈ దశలో నితీశ్, సలీల్ ఐదో వికెట్‌కు 56 పరుగుల భాగస్వామ్యంతో ఆశలు రేపారు. కానీ, నితీశ్‌ను జడేజా.. కమిన్స్ (1)ను సుశాంత్ వెనక్కిపంపడంతో సన్‌రైజన్స్ 139/7తో ఓటమి అంచున నిలిచింది.

# చిరువ్యాపారులను దౌర్జన్యంగా తొలగించడం బాధాకరం



## ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకుండా పొట్టకొట్టడం సరికాదు

## చిరువ్యాపారుల సంఘం అధ్యక్షుడు గజ్జెల లింగమూర్తి ఆవేదన

**జనోదయ : వరంగల్ ప్రతినిధి**

వరంగల్ హెడ్ పోస్టాఫీస్ పరిధిలో రోడ్డుకు ఇరుపక్కల చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న చిరువ్యాపారులను దౌర్జన్యంగా తొలగించడం బాధాకరమని చిరువ్యాపారుల సంఘం అధ్యక్షులు గజ్జెల లింగమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఎండకు, వానకు, చలిని లెక్కచేయకుండా ఎవరిపైనా ఆధారపడకుండా కుటుంబ పోషణ కోసం ఆరాటపడుతూ.. బ్రతుకుతున్న చిరు వ్యాపారులను దేశద్రోహుల్లాగా, పాకిస్తాన్ ఉగ్రవాదుల మాదిరిగా పోలీసులు జేసీబీలతో భయభ్రాంతులకు గురిచేస్తూ తొలగించడం సరికాదని ఆయన అన్నారు. “రోడ్డునే నమ్ముకుని గత కొన్నేళ్లుగా బ్రతుకుతున్న వాళ్ల పొట్టకొట్టడం పద్ధతి కాదు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా తొలగిస్తే వాళ్ల జీవన విధానం ఏమిటి? బతుకులకు భరోసా ఇవ్వాల్సిన అధికారులే ఇలా చేస్తే ఎవరికి చెప్పుకోవాలి మా బాధలు?” అని లింగమూర్తి ప్రశ్నించారు. తూర్పు నియోజకవర్గంలో చిరువ్యాపారులకు శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రత్యేకంగా స్థలాలను గుర్తించి మడిగేలా నిర్మాణం వెంటనే చేపట్టాలని కోరారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే వరకు ఉన్న స్థలాల్లోనే వ్యాపారాలు చేసుకుని జీవించే అవకాశం ఇవ్వాలని జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ కమిషనర్, ట్రాఫిక్ మరియు లా అండ్ ఆర్డర్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిరువ్యాపారుల భద్రత కోసం 2014లోనే ప్రత్యేక చట్టం చేసి వ్యాపారులను మెప్మా ద్వారా గుర్తించి ఐడీ కార్డులు, లైసెన్సులు, బ్యాంకు లోన్లు కూడా ఇచ్చాయని గుర్తుచేశారు. “చట్టప్రకారం మేము మనుషులమే. బ్రతికే హక్కు రాజ్యాంగం కల్పించింది. కాబట్టి ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేసే వరకు ఉన్న స్థలంలోనే వ్యాపారాలు చేసుకునే అవకాశం కల్పించాలి” అని మంత్రులు,ఎమ్మెల్యేలు,రాజకీయ నాయకులను కోరారు. ఈకార్యక్రమంలో వివిధ చిరు వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన హనుమకొండ నూతన ఆర్డీవో వెంకటేష్



**జనోదయ : హనుమకొండ**

హనుమకొండ జిల్లా  రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)గా బాధ్యతలు స్వీకరించిన వెంకటేష్ బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయిని కలెక్టరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ములుగు ఆర్డీవోగా విధులు నిర్వహించిన వెంకటేష్ బదిలీపై హనుమకొండ ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేష్‌కు కార్యాలయ ఉద్యోగులు, అధికారులు,  శుభాకాంక్షలు తెలియజేశారు.

# చింతల్ బ్రిడ్జిపై ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి



## సిగ్నల్స్ లేక నిత్యం ప్రమాదాలు

## వాకర్లు, వాహనదారుల ప్రాణాలతో చెలగాటం

## అధికారులు, ట్రాఫిక్, మున్సిపల్ శాఖ తక్షణం స్పందించాలి

## ప్రజల డిమాండ్

**జనోదయ : వరంగల్ ప్రతినిధి**

చింతల్ బ్రిడ్జిపై ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడంతో నిత్యం అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వెంటనే సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని ప్రజలు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. చింతల్ గ్రౌండ్ పెద్ద ఎత్తున విస్తరించడంతో నగరంలోని ప్రజలు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వాకింగ్ కోసం పెద్ద సంఖ్యలో వస్తుంటారు. దీంతో ఈ రోడ్డుపై వాహనదారులు, నడుచుకుంటూ వెళ్లే వారితో నిత్యం సందడిగా ఉంటోంది. అయితే బ్రిడ్జిపై ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడంతో వాహనాలు అతివేగంగా వెళ్తుండటంతో దీనివల్ల పాదచారులు రోడ్డు దాటేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలోనే పెద్ద ఎత్తున ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు వార్తలు వచ్చినా అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ కార్పొరేషన్ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాణ నష్టం జరిగే వరకు వేచిచూడకుండా తక్షణమే చింతల్ బ్రిడ్జిపై ట్రాఫిక్ సిగ్నల్స్, స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా క్రాసింగ్‌లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కూడా ఈ సమస్యపై దృష్టి సారించి ప్రజల ప్రాణాలను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# సుబేదారి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ట్రాన్స్ జెండర్స్‌తో ప్రత్యేక కౌన్సిలింగ్



**జనోదయ : హనుమకొండ**

నగరంలోని ప్రధాన కూడళ్లు, ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ల వద్ద వాహనదారులను ఇబ్బందులకు గురి చేయవద్దని, బలవంతంగా డబ్బులు అడగడం, వాహనదారులతో అసభ్యంగా ప్రవర్తించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే ప్రజలకు అసౌకర్యం కలగకుండా వ్యవహరించాలని, సమాజంలో గౌరవప్రదంగా జీవించేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సహకరిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సుబేదారి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ రంగనాథ స్వామికి పంచామృతాభిషేకం వైభవంగా ప్రత్యేక పూజలు



## వైశాఖ శుద్ధ ఏకాదశి, హస్తా నక్షత్రం బ్రహ్మ ముహూర్తాన అభిషేకం

## ఆలయ చైర్మన్, ధర్మకర్తలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరు

**జనోదయ : ప్రతినిధి**

వైశాఖ శుద్ధ ఏకాదశి, హస్తా నక్షత్రం పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం బ్రహ్మ ముహూర్తము నందు వరుణ దేవుని అమృతాక్షింతలతో శ్రీ రంగనాథ స్వామి వారికి పంచామృతములతో అభిషేకము, ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రాతఃకాలమందు ఈ విశేష పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి.  ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ గోషికొండ శకుంతల సుధాకర్, ధర్మకర్తలు నీలం అరుణ శ్రీనివాస్, పల్లకొండ రాజమణి రమేష్, మేడుకుర్తి లోకేష్ రేణుక, పిట్టల కోటీశ్వర్, మాజీ ఎమ్ఆర్ఓ కుసుమ సత్యనారాయణ దంపతులు, కట్కూరి సత్యనారాయణ రెడ్డి దంపతులు, మాజీ దేవాలయ కో-కన్వీనర్ ఆకేన వెంకటేశ్వర్లు, తలకోటి రమేష్, శ్రీరాముల పుష్పలీల, ఓని రజిత, సీత, గుమలాపురం ఉప్పలయ్య, దూడం రాజు, శ్రావణకుమార్ మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.




# బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ రవిచంద్ర

**త్యాగానికి, భక్తి విశ్వాసాలకు ప్రతీక బక్రీద్**

**కేసీఆర్ పాలనలో మైనారిటీలకు సముచిత గౌరవం**

**పదేళ్ల సంక్షేమ పాలన గుర్తుచేసిన**

**రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర**



**వరంగల్ : జనోదయ : ప్రతినిధి**

బక్రీద్ పండుగ (ఈద్-ఉల్-అధా) సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ముస్లిం సమాజానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లిం సమాజం జరుపుకునే ప్రధానమైన పండుగల్లో ఒకటైన బక్రీద్ త్యాగానికి, భక్తి విశ్వాసాలకు ప్రతీక అని తన సందేశంలో ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. మహ్మద్ ప్రవక్త, ఇస్లాం బోధించిన మానవత్వం, ప్రేమ, శాంతి, సమానత్వం, దయ, కరుణ, క్షమా గుణాలు ఆనాడు, ఈనాడు, ఏనాటికైనా కూడా ప్రపంచ మానవాళికి ఆచరణీయం, అనుసరణీయం అని అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు అన్ని ధర్మాలను సమదృష్టితో చూస్తారని, గౌరవిస్తారన్నారన్నారు. మహమూద్ అలీకి ఉప ముఖ్యమంత్రి పదవితో పాటు ప్రధానమైన హోంశాఖ కేటాయించి సముచిత గౌరవం ఇచ్చారన్నారు. ఆయన పదేళ్ల పాలనలో మైనారిటీల సంక్షేమం, అభ్యున్నతికి పలు పథకాలు, కార్యక్రమాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేశారని తెలిపారు. కేసీఆర్ సుపరిపాలనలో శాంతిభద్రతలు సజావుగా ఉండి, గంగా-జమున తహజీబ్ సంస్కృతి వెల్లివిరిసిందని అన్నారు. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు షాదీ ముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టి 1,00,116 రూపాయల ఉచిత సాయం అందించడం, ప్రత్యేక గురుకులాల ద్వారా నాణ్యమైన విద్యను అందుబాటులోకి తేవడంతో బాల్య వివాహాలు గణనీయంగా తగ్గాయన్నారు. అనాథలైన బాలబాలికల కోసం నగరం నడిబొడ్డున నాంపల్లిలో నిజాం కాలంలో కట్టిన “అనీస్-ఉల్-గుర్బా” అధునాతన భవన నిర్మాణానికి కేసీఆర్ నిధులు విడుదల చేయడాన్ని ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు గుర్తు చేశారు. విదేశాలలో ఉన్నత విద్యనభ్యసించేందుకు ఆసక్తి చూపే యువతకు “చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్” పేరిట 20 లక్షల రూపాయల చొప్పున సాయంతో పాటుగా విమాన ప్రయాణానికి టిక్కెట్ ఉచితంగా అందించారన్నారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం కార్లు, వ్యాన్లు, ఆటోలు అందించడం జరిగిందని పేర్కొన్నారు. రంజాన్ పవిత్ర మాసంలో ప్రార్థనా స్థలాల మరమ్మతులు, ఆధునీకరణకు నిధులు విడుదల చేయడమే కాక పేద వర్గాల వారికి చీరలు, దుస్తులు బహుకరించేవారని వివరించారు. సుమారు 10,000మంది ఇమాంలు, మోజన్లకు 5,000 రూపాయల చొప్పున నెలానెలా గౌరవ వేతనం ఇచ్చేవారని, ఎల్బీ స్టేడియంలో అధికారికంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు జరిగేదని అన్నారు. పండుగను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ప్రశాంతంగా జరుపుకోవాల్సిందిగా కోరుతూ.. అల్లాహ్ అనుగ్రహంతో అందరి జీవితాలు సుఖ సంతోషాలతో, శాంతియుతంగా వర్థిల్లాలని ఆకాంక్షించారు. ఈద్-ఉల్-అధా పర్వదినం సందర్భంగా తెలంగాణలోని ముస్లిం సమాజానికి, దేశ, విదేశాలలో నివశిస్తున్న, స్థిరపడిన తెలంగాణ ముస్లింలకు ఎంపీ వద్దిరాజు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# అకాలవర్షాల్లో ధాన్యం రక్షణచర్యలు చేపట్టాలి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశాలు**

**జనోదయ : ఉమ్మడి ఖమ్మం ప్రతినిధి**



అకాలవర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, కవర్లు ఏర్పాటుచేసి పటిష్ట రక్షణచర్యలు చేపట్టాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. వర్షపు నీరు ధాన్యం నిల్వల వద్ద చేరకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం పెనగడపలోని ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని కలెక్టర్ అంకిత్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిల్వలు, కొనుగోలు ప్రక్రియ, లోడింగ్, రవాణా ఏర్పాట్లు, తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కొనుగోలుకేంద్రంలో దాదాపు 1200 క్వింటాళ్ల ధాన్యం నిల్వలున్నాయని, వాటిని సుజాతనగర్ లోని రైస్ మిల్లుకు రెండు రోజుల్లోపు తరలించేలా చర్యలు చేపడుతున్నామని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగంగా పూర్తిచేసి రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలిస్తూ లోడింగ్, రవాణా సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. కొనుగోలుకేంద్రాల్లో తాగునీరు, నీడ, వంటి సదుపాయాలు, అవసరమైన వసతులు కల్పించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకత పాటిస్తూ రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంట డీసీఓ ప్రేమ్ కుమార్, డీఎం సతీష్, చుంచుపల్లి తహసిల్దార్ నాగరాజు, ఎంపీడీఓ సుభాషిణి, ఐకేపీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల పరిశీలన



**పనులు వేగవంతం చేయాలి**

**స్లాబ్ వర్క్ త్వరగా పూర్తి చేయాలని**

**కాంట్రాక్టర్‌కు ఆదేశం**

**జనోదయ : వరంగల్ ప్రతినిధి**

16వ డివిజన్ పరిధిలోని గరీబ్ నగర్‌లో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాల్ పనులను స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ సుంకరి మనీషా శివకుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా స్లాబ్ వర్క్ పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. అలాగే నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, సకాలంలో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు ఉపయోగపడే ఈ కమ్యూనిటీ హాల్ త్వరలో అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఈదురుగాలుల వర్షంతో నష్టపోయిన ప్రాంతాలను పరిశీలించిన తహసీల్దార్ రజిత

**జనోదయ : గంగాధర**



గంగాధర మండల పరిధిలో నిన్న రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కారణంగా బూరుగుపల్లి, నాగిరెడ్డిపూర్ మరియు గంగాధర చావీజ పరిధిలో దాన్యం తడవడంతో పాటు ఇండ్లు, ఆస్తులకు జరిగిన నష్టాన్ని తహసీల్దార్ అంబటి రజిత స్థానిక సర్పంచ్‌లతో కలిసి పరిశీలించారు. బూరుగుపల్లి గ్రామంలో సర్పంచ్ దూలం కళ్యాణ్‌తో కలిసి దాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన తహసీల్దార్, వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలను వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం గ్రామంలో రేకుల షెడ్లు కూలిపోయిన బాధిత కుటుంబాలను పరామర్శించి, జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపించి తగిన ప్రతిపాదనలు సమర్పిస్తామని తెలిపారు. అలాగే నాగిరెడ్డిపూర్ గ్రామంలో సర్పంచ్ గునుకొండ యశోద బాబుతో కలిసి వర్షాల వల్ల జరిగిన ఆస్తి నష్టాన్ని పరిశీలించి, బాధిత కుటుంబాల వివరాలను సేకరించి నష్ట నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. తదుపరి గంగాధర చావీజ దాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్, తడిసిన ధాన్యం బస్తాలను వెంటనే రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించి, లారీలను సమకూర్చారు. ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి సర్పంచ్ దూలం కళ్యాణ్, నాగిరెడ్డిపూర్ సర్పంచ్ గునుకొండ యశోద బాబు, రాజూ సీఈఓ రమేష్, దూలం అంజయ్య, జీపీఓలు పాల్గొన్నారు.




# మానవ అక్రమ రవాణా బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

**మహిళల స్వయం సమృద్ధికి స్కిల్ ట్రైనింగ్‌పై విశేష అవగాహన**

**ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సమితి ఆధ్వర్యంలో కార్యక్రమం**

**50 మంది మహిళల హాజరు**




జనోదయ : వరంగల్ ప్రతినిధి

ఖిలా వరంగల్ మండలంలోని శంభునిపేట హైస్కూల్ నందు 27/05/2026 బుధవారం మానవ మరియు బాలల అక్రమ రవాణా నిర్మూలనపై, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సమావేశం నిర్వహించారు. అలాగే మహిళల స్వయం సమృద్ధి సాధన కొరకు స్కిల్ ట్రైనింగ్ ఉపయోగంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమం ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సమితి ఖిలా వరంగల్ మండల కో–ఆర్డినేటర్ ఈసంపల్లి సుదర్శన్ ఆధ్వర్యంలో, అంగన్వాడీ టీచర్ స్వర్ణలత అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుదర్శన్ మాట్లాడుతూ.. మహిళలు సభ్య సమాజంలో ఆధునిక సమాజానికి తగినట్టుగా స్వయంకృషితో అభివృద్ధి సాధించాలని అన్నారు. అన్ని రంగాలలో నైపుణ్యత, జ్ఞానం, విజ్ఞానంతో ఆధునిక వీరవనితలుగా ప్రసిద్ధి ప్రశంసలు పొందాలని పిలుపునిచ్చారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఆర్థిక అభివృద్ధిని సాధించడానికి కుటుంబాల పాత్ర ఎంతో ముఖ్యమైనదని, ప్రతి కుటుంబం స్త్రీ చేతిలో మలచబడి ఉంటుందని అన్నారు. అందుకొరకు కుటుంబాలు అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని తెలిపారు. మగ్గం వర్క్, టైలరింగ్, బ్యూటీషియన్, బోటిక్, కంప్యూటర్ ట్రైనింగ్ మొదలగు స్కిల్స్‌పై విశేష అనుభవం ఉండాలని, అలాగే టెక్స్‌టైల్ పార్క్ లో ఉద్యోగ అవకాశాలు పొందాలని కోరారు. ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఉచితంగా మహిళలకు స్కిల్స్ ట్రైనింగ్ ఇచ్చి నైపుణ్యతలను నేర్పిస్తుందని, సర్టిఫికెట్స్ ప్రధానం చేస్తుందని తెలిపారు. మహిళా సాధికారతలో ప్రతిష్టాత్మక స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శంభునిపేట అంగన్వాడీ టీచర్ స్వర్ణలతతో పాటు 50 మంది స్త్రీలు, మహిళలు పాల్గొన్నారు.

# మాపై ఏపీ పెత్తనమేంది?




**ఖైరతాబాద్, మే 27 :** ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి దశాబ్ద కాలం గడి చినా ఇంకా ఆంధ్రా పెత్తనం కొనసాగుతున్నదని, ఇకనైనా అక్కడి నేతలు తమ వైఖరి మార్చు కోవాలని వక్తలు హితవు పలికారు. తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్ యాదవ్ అధ్యక్షతన సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి మాట్లాడుతూ ప్రొఫెసర్ నాగేశ్వర్ సంస్కారం ఉన్న వ్యక్తి అని, సినీనటులకు ఆయన విలువేం తెలుస్తుందని ప్రశ్నించారు. తెలంగాణలో ఇంకా ఆంధ్రా పెత్తనం కొనసాగుతున్నదని, ప్రస్తుతం రాజ్యాంగంలోని నాలుగు అంగాలు వారి చేతుల్లోనే ఉన్నాయని విమర్శించారు. ప్రస్తుత మంత్రివర్గంలోనూ అదే తంతు సాగుతున్నదని, సినీగాయకుడు బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని పెడుతూ, గద్దర్ విగ్ర హాన్ని మాత్రం అడ్డుకుంటున్నా రని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ పరిస్థితుల్లో మళ్లీ మరో ఉద్యమా న్ని నిర్మించాల్సి అవసరం ఉన్న దని అభిప్రాయపడ్డారు. ఉన్నది ఉన్నట్టు మాట్లాడితే ఏపీ ప్రభుత్వం అరెస్టులంటున్నదని, అరెస్టు చేస్తారనే భయం తనకు లేనం దునే యాంటిసిపేటరీ బెయిల్‌కు దరఖాస్తు చేయలేదని ప్రొఫెసర్ నాగేశ్వర్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు తాను అసెంబ్లీ మెట్లెక్కాను కానీ ఇంకా జైలు అనుభవం లేదని, ఇలాంటి ఓ కేసుతో అది తీరుతుందని భావిస్తున్నానని చెప్పారు. అయితే అరెస్ట్ చేసేం దుకు ఇప్పటివరకు ఎవరూ తన ఇంటికి రాలేదని తెలిపారు.

# చెన్నూర్ లయన్స్ క్లబ్ జాడి తిరుపతికి ప్రతిష్టాత్మక అవార్డు

జనోదయ : ఆర్ సి చెన్నూర్

సమాజ సేవలో మరియు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థాగత బలోపేతంలో విశేష కృషి చేసినందుకు గాను జోన్ చైర్‌పర్సన్‌గ జాడి తిరుపతి ప్రతిష్టాత్మక బెస్ట్‌గ జ అవార్డును అందుకున్నారు. ఇటీవల జరిగిన లయన్స్ క్లబ్ వేడుకల్లో భాగంగా, వీణ 320 + రియల్టీ కోఆర్డినేటర్ చిట్టి ప్రకాష్ రావు మరియు ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, ఇంపాక్ట్ ఫౌండేషన్ అధినేత గంప నాగేశ్వర రావు చేతుల మీదుగా ఆయన ఈ అత్యున్నత పురస్కారాన్ని అందుకున్నారు. తన జోన్ పరిధిలోని వివిధ లయన్స్ క్లబ్‌లను సమర్థవంతంగా సమన్వయం చేస్తూ, నిరుపేదలకు వైద్య శిబిరాలు, విద్యా సాయం మరియు పర్యావరణ పరిరక్షణ వంటి ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను జాడి తిరుపతి విజయవంతంగా నిర్వహించారు. ఆయన చూపిన అద్భుతమైన నాయకత్వ ప్రతిభను మరియు నిరంతర సేవలను గుర్తిస్తూ మేనేజ్‌మెంట్ ఈ అవార్డును ప్రకటించింది. ఈ సందర్భంగా అవార్డు బహూకరించిన



చిట్టి ప్రకాష్ రావు మరియు గంప నాగేశ్వరరావు మాట్లాడుతూ జాడి తిరుపతి లాంటి నిబద్ధత గల నాయకులు సమాజానికి ఎంతో అవసరమని కొనియాడారు. ఆయన సేవలు మరెందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని ప్రశంసించారు. ఈ ఘన విజయం పట్ల లయన్స్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు మరియు హితైషులు జాడి తిరుపతి కి పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# నాయిని రాజేందర్ రెడ్డి.. ఖబర్దార్

**ఆలయ భూమిని నీ అల్లుడికి హోటల్ కోసం కుట్రలు చేస్తున్నావ్**

**నా జపం మాని..ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచెయ్**

**అధికారం ఉన్నా లేకున్నా ప్రజల కోసం పని చేస్తా**



జనోదయ : హనుమకొండ

బిడ్డా.. నాయిని రాజేందర్ రెడ్డి.. ఖబర్దార్.. నీ గతం, నీ చరిత్ర మొత్తం నాకు తెలుసు.. అనవసరంగా నాపై చిల్లర విమర్శలు, ఆరోపణలు చేస్తే ఇకపై సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ప్రస్తుత వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బుధవారంహనుమకొండ లోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..స్వర్గీయ ఎన్టీఆర్ టైమ్ లో మధ్యపాన నిషేధం సమయంలో నువ్వు పక్క రాష్ట్రాల నుంచి ప్లాస్టిక్ బ్యాటిళ్లలో ఏమి తెప్పించావో, అప్పుడు నీ వెంబడి పోలీసులు పడితే తప్పించుకొని వడ్డేపల్లి లోని మన కామన్ ఫ్రెండ్ చిన్నాను పట్టుకొని మా అన్న దగ్గరికి వచ్చిన విషయం మర్చిపోయావా.. అని గుర్తు చేశారు. ప్రజలు అధికారం ఇచ్చారు.. ప్రజా సేవ చెయ్.. అంతేకానీ మళ్ళీ నాపై ఆరోపణలు, చిల్లర విమర్శలు చేస్తే ఖబడ్దార్ బిడ్డా.. అని హెచ్చరించారు. భక్తాంజనేయ ఆలయ భూమిని నీ అల్లుడి కోసం హోటల్ నిర్మించేటందుకు కుట్రలు చేస్తున్నావ్.. అది ప్రజలు గమనిస్తున్నారనేది మర్చిపోకు అని అన్నారు. హనుమాన్ విగ్రహం పెట్టిన వారిపై కేసులు పెట్టారు, మరి విగ్రహం కూల్చిన వారిపై కేసులు ఎందుకు లేవు అని ఆయన ప్రశ్నించారు. డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నావ్ బిడ్డా జాగ్రత్త.. నీ సంగతి హనుమాన్ భక్తులు, దేవుడే చూస్తాడు అని అన్నారు. అధికారం ఉన్నా.. లేకున్నా ప్రజల కోసం, ప్రజల మధ్యన ఉండి పనిచేసే వ్యక్తినని స్పష్టం చేశారు. కార్మికుడి వెన్ను విరుస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు..అంతకుముందు కార్మిక ఉద్యోగ చైతన్య మాసోత్సవం లో భాగంగా 30 పైగా సంఘాలతో సమావేశం నిర్వహించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయి అని, కార్మికులు గోస పడుతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ డిపార్ట్మెంట్ లో అధికారులకు కార్మికులు ఎన్ని దరఖాస్త్ లు ఇచ్చిన వారి సమస్యలు పరిష్కారం కావడంలేదని మండిపడ్డారు. కేంద్రం కార్మిక, రైతు, ఉద్యోగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తోంది అని విమర్శించారు. కార్మిక లోకానికి బీఆర్ఎస్ అండగా ఉంటుంది అని, కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాడుతాం అని అన్నారు. సమావేశంలో బీఆర్టీయూ కన్వీనర్ నాయిని రవి, పెయింటర్స్ యూనియన్ అధ్యక్షులు రాజారపు రాజు, సిరికొండ బిక్షపతి, రమ, తదితర కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

# చొప్పదండిలో కలిసి పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యం

**కేంద్ర మంత్రి బండి సంజయ్**
**చొప్పదండి నియోజకవర్గమే నిదర్శనం**
**రోడ్ల నిర్మాణానికే రూ.6 వేల కోట్లకుపైగా వెచ్చించిన**
**రవాణా సౌకర్యాలు బాగుంటేనే అభివృద్ధి సాధ్యం**
**రూ.50 కోట్లతో ఆర్నకొండ మల్యాల డబుల్ రోడ్డు**
**విస్తరణ పనులకు కేంద్ర మంత్రి శ్రీకారం**
**కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంసహా పలువురు**
**కాంగ్రెస్ నేతల హాజరు**



జనోదయ : గంగాధర

చొప్పదండి "కలిసి పనిచేస్తే అభివృద్ధి ఏ విధంగా సాధ్యమో చొప్పదండి నియోజకవర్గమే నిదర్శనం. రాజకీయాలను పక్కనపెట్టి నమ్మి ఓట్లేసిన ప్రజల కోసం కలిసి పనిచేయడం వల్ల చొప్పదండికి పెద్ద ఎత్తున నిధులు వస్తున్నాయి. అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. అందులో భాగంగానే రూ.50 కోట్లతో ఆర్నకొండ మల్యాల డబుల్ రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించుకోగలగుతున్నాం"అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కొద్ది సేపటి క్రితం చొప్పదండి మండలం ఆర్నకొండ విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆర్నకొండ నుండి మల్యాల వరకు 35 కి.మీల మేరకు డబుల్ రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు మేడిపల్లి సత్యం, కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ కొలగాని శ్రీనివాస్, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తదితరులతో కలిసి కేంద్ర మంత్రి ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే.....కలిసి పనిచేస్తే అభివృద్ధి ఏ విధంగా సాధ్యమో చొప్పదండి నియోజకవర్గమే నిదర్శనం. రాజకీయాలను పక్కనపెట్టి నమ్మి ఓట్లేసిన ప్రజల కోసం కలిసి పనిచేయడంవల్ల చొప్పదండికి పెద్ద ఎత్తున నిధులు వస్తున్నాయి. అభివృద్ధి చేస్తున్నాం. అందులో భాగంగా చొప్పదండి మండలం ఆర్నకొండ గ్రామం నుండి గోపాల్ రావు మీదుగా మల్యాల వరకు మొత్తం 35 కి.మీల మేరకు సింగిల్ రోడ్డును డబుల్ లేన్ రోడ్డుగా విస్తరించే పనులకు ఈరోజు శ్రీకారం చుట్టడం చాలా సంతోషంగా ఉంది. మొత్తం 50 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఈ రోడ్డును విస్తరించబోతున్నాం. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి జ=×ఖీ నిధులతో ఈ పనులను చేపడుతున్నాం. ఈ రోడ్డు పనులు పూర్తయితే ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ చుట్టుపక్కల ఉన్న మండలాల వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ఎంతో ఉపయోగపడుతుంది. అట్లాగే పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల నుండి కొండగట్టు ఆలయానికి వచ్చే భక్తులకు ఈ రోడ్డు అత్యంత సమీప మార్గం కాబోతోంది. ఈ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పలు చోట్ల కల్వర్టులను కూడా నిర్మించబోతున్నాం. అట్లాగే ఒక చోట మైనర్ బిడ్జి విస్తరణ పనులను కూడా చేపడతాం. ఏడాదిలోపు ఈ రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేసి వచ్చే ఏడాది ఏప్రిల్ నెలాఖరు నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గడువు విధించాం. ఈ మేరకు కాంట్రాక్టర్‌తో ఒప్పందం కుదిరింది.మీకు తెలుసు... ఏ దేశమైనా, ఏ రాష్ట్రమైనా, ఏ జిల్లా, ఏ గ్రామమైనా బాగుపడాలంటే... రవాణా సౌకర్యాలు బాగుంటేనే సాధ్యమవుతుంది. అందుకే నేను ఎంపీగా ఎన్నికైనప్పటి నుండి ఇప్పటి వరకు అత్యధిక ప్రాధాన్యత రోడ్ల నిర్మాణానికే ఇచ్చాను. గ్రామీణ ఉపాధి హామీ, ప్రధానమంత్రి సడక్ యోజన, జ=×ఖీ కార్యక్రమాల నిధులతోపాటు జాతీయ రహదారుల విస్తరణ కోసమే ఎక్కువ నిధులు తీసుకొచ్చిన. గత 7 ఏళ్లలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం 20 వేల కోట్లకుపైగా కేంద్ర నిధులు తీసుకొస్తే, అందులో రోడ్ల నిర్మాణం కోసం 7 వేల కోట్ల రూపాయలకు పైగా నిధులు ఖర్చు చేసినం. 2 వేల 147 కోట్లు నిధులతో కరీంనగర్-వరంగల్ నేషనల్ హైవే, 578 కోట్ల రూపాయలతో ఎల్కతుర్తి-సిద్దిపేట నేషనల్ హైవే పనులు చేపట్టి శరవేగంగా పూర్తి చేయిస్తున్న. కరీంనగర్, జగిత్యాల ప్రజల చిరకాల వాంఛ గా ఉన్న కరీంనగర్- జగిత్యాల రోడ్డు విస్తరణ పనుల విషయంలో రకరకాల కారణాలవల్ల కొంత జాప్యం జరిగింది. దాదాపు 2 వేల కోట్ల నిధులతో ఈ జాతీయ రహదారి పనులకు అతి త్వరలోనే శ్రీకారం చుట్టబోతున్నాం. జ=×ఖీ నిధులను సైతం పెద్ద ఎత్తున కరీంనగర్ పార్లమెంట్ కు తీసుకొచ్చిన. గతంలో తెలంగాణ మొత్తానికి 800 కోట్ల సీఐఆర్ఎఫ్ నిధులు మంజూరైతే... అందులో ఒక్క కరీంనగర్ పార్లమెంట్ కే 291 కోట్లు తీసుకొచ్చి 1341 కిలోమీటర్ల మేరకు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రోడ్లను నిర్మించినం. ఇప్పటి వరకు దాదాపు 400 కోట్లకుపైగా సీఐఆర్ఎఫ్ నిధులు తీసుకొచ్చిన. అట్లాగే జాతీయ ఉపాధి హామీ పథకం కింద (వచ్చే జులై 1 నుండి వీబీజీ రామ్ జీ స్కీంగా పేరు మారబోతోంది) ఇప్పటి వరకు దాదాపు 700 కోట్ల రూపాయల నిధులను మన పార్లమెంట్ పరిధిలో ఖర్చు చేసినం. గ్రామీణ సడక్ యోజన పథకం కింద దాదాపు 130 కోట్లు ఖర్చు చేసి రోడ్లు నిర్మించినం.మళ్లీ చెబుతున్నా.... కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి కోసం ఇంకా పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తా. గ్రామగ్రామాన, గల్లీగల్లీలో రోడ్లు వేయిస్తా. ప్రజల అభివృద్ధే నా లక్ష్యం. అందుకోసం రాజకీయాలకు అతీతంగా అందరిని కలుపుకుంటూ పార్లమెంట్ అభివృద్ధికి క్రుషి చేస్తా. కాంగ్రెస్, బీఆర్ఎస్ అనే వివక్ష లేకుండా ఓటేసిన ప్రజల ఆకాంక్ష మేరకు చేయి చేయి కలుపుదాం... కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుదాం. కలిసి రావాలని అన్ని పార్టీల ప్రజా ప్రతినిధులను, నాయకులను కోరుతున్నా...

## రామగుండం నగరాన్ని నివాసయోగ్యమైన నగరంగా తీర్చిదిద్దుతా

జనోదయ : గోదావరిఖని

రామగుండంను విద్యా, ఉపాధి కేంద్రంగా ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దుతున్నామని రామగుండం శాసన సభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ అన్నారు. డి ఎం ఎఫ్ టి నిధులు రూ. 4.18 కోట్లతో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 26, 02వ డివిజన్లలో సి సి, బి టి రోడ్ల నిర్మాణం, 48వ డివిజన్‌లో వర్షపు నీటి కాలువ నిర్మాణం, అలాగే 49వ డివిజన్‌తో పాటు ఇతర డివిజన్లలో ప్రహరీ గోడల నిర్మాణ పనులకు శాసన సభ్యులు ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ బుధవారం టీచర్స్ కాలనీ లో నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ మహంకాళి స్వామి తో కలిసి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ 800 కోట్లతో మునిసిపల్ కార్పొరేషన్ లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మరో రూ 400 కోట్ల నిధుల మంజూరుకు ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. . త్వరలో కొత్తగా ఎనిమిది కొత్త ట్యాంకులు నిర్మించి నగరమంతా 24ఇ7 నీటి సరఫరా ఆరంభించనున్నామని అన్నారు. ప్రతి చిన్న వీధిలోనూ సకల సదుపాయాలు కల్పించాలని ఇందుకు అవసరమైన నిధులు తీసుకువస్తున్నామని అన్నారు. నిధులు కొరతతో అర్ధాంతరంగా ఆగిపోయిన కోర్టు భవనాన్ని నిధులు మంజూరు చేయించి పూర్తి చేయిస్తామని అన్నారు.ప్రభుత్వ పాటశాలలు అద్భుత భవనాలతో నాణ్యమైన విద్య అందిస్తున్నందున అందులోనే పిల్లల్ని చేర్పించాలని అన్నారు.కబ్జా కు గురయిన ప్రభుత్వ భూమి అంగుళం కూడా తగ్గకుండా తిరిగి స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. త్వరలో ఇక్కడ అందుబాటులో ఉన్న భూమి లో హరిత హోటల్ నిర్మిస్తామని అన్నారు.మేయర్



మహంకాళి స్వామి మాట్లాడుతూ ఎం ఎల్ ఏ ఆదేశాల మేరకు టీచర్స్ కాలనీ లో వర్షాకాలంలో వరద ప్రభావం లేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. టీచర్స్ కాలనీ లో కాలువ ను కుదించి నిర్మించిన ఆక్రమణ లు వెంటనే తొలగించడానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. గతంలో ద్విచక్ర వాహనం వెళ్లడానికి కూడా అవకాశం లేని టీచర్స్ కాలనీ, కె సి ఆర్ కాలనీ , ఆర్ టి సి కాలనీ లలో ని వీధుల్లో రోడ్లన్నీ నాణ్యత తో చేపట్టడం జరిగిందని అన్నారు.చివరి ఇంటి వరకు కూడా రోడ్లు, యు జి డి, మంచి నీళ్ళు, వీధి దీపాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు),రామగుండం నగర పాలక సంస్థ కమీషనర్ జె.అరుణ శ్రీ,కార్పొరేటర్లు రేణికుంట్ల నిర్మల, సాగి సంతోష్ రావు, వెంగళ బాపు, బాలసాని తిరుపతి, దాసరి సాంబమూర్తి, బదావత్ నర్సమ్మ,,భాగ్యలక్ష్మి,సత్య ప్రసాద్, నగర పాలక సంస్థ ఎస్ ఇ గురువీర తదితరులు పాల్గొన్నారు.

## 2029 ఎన్నికల్లో

## మహిళలకు 33శాతం సీట్లు

(మొదటి పేజీ తరువాయి)

విశ్వసిస్తోంది. మహిళలను అవమానపరిచే మాటలు ఎవరూ మాట్లాడకూడదు. దీనికోసం పోరాటం మన నుంచే మొదలుకావాలి' అని వివరించారు.'టీడీపీలో కార్యకర్తే అధినేత. 2019 నుంచి 2024 వరకు పుసుపు సైన్యం చేసిన పోరాటం ఒక చరిత్ర. తోట చంద్రయ్య, అంజిరెడ్డి తాత, మంజుల, చెన్నుపాటి గాంధీ.. వీరంతా మనకు స్ఫూర్తి. మన అధినేతను 53 రోజులు అక్రమంగా అరెస్టు చేస్తే ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారంతా రోడ్లపైకి వచ్చారు. అది మన క్రెడిబిలిటీ' అని అన్నారు.'కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఎవరూ ఇవ్వని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ఒకే రాష్ట్రం.. ఒకే రాజధాని.. అభివృద్ధి వికేంద్రీకరణ మన విధానం. దేశవ్యాప్తంగా వచ్చే పెట్టుబడుల్లో ఈ రోజు 25 శాతం ఏపీకి వస్తున్నాయి. నేను టీమ్11 కెప్టెన్ కు ఆఫర్ ఇస్తున్నా.. సమయం, తేదీ మీరు ఫిక్స్ చేయండి. సంక్షేమం, అభివృద్ధిపై చర్చకు నేను రెడీ. సైకో హయాంలో బీసీలు, దళితులు, మైనారిటీలపై జరిగిన దాడులను మనం మర్చి పోవద్దు' అని సూచించారు.'నిజం గడప దాటే ముందే అబద్ధం ప్రపంచం చుట్టి వస్తుంది. బాబాయిని చంపి కత్తి చంద్రబాబు చేతిలో పెట్టారు. వైసీపీ ఫేక్ ప్రాపగాండను గట్టిగా తిప్పికొట్టాలి. ఇప్పుడు రోజుకో కుట్రతో వస్తున్నారు. తాజాగా డీఎస్సీ గురించి మాట్లాడుతున్నారు. సైకో నీది టెన్త్ క్లాస్ పేపర్ కొట్టేసిన చరిత్ర.. నాది స్టాన్‌ఫోర్డు హిస్టరీ. టీచర్లను లిక్కర్ షాపుల ముందు నిలబెట్టిన హిస్టరీ నీది.. టీచర్లను శిక్షణ కోసం సింగపూర్ పంపిన హిస్టరీ నాది. 5 సంవత్సరాల్లో ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయని హిస్టరీ నీది.. 16,347 టీచర్ పోస్టులు ఒక్కసారిగా భర్తీ చేసిన హిస్టరీ నాది' అని లోకేశ్ అన్నారు.

# అనుమతి లేని సైరన్లు, ఫ్లాష్ లైట్లు, నిబంధనలకు విరుద్ధమైన నెంబర్ ప్లేట్లపై ప్రత్యేక డ్రైవ్

**జనోదయ : శేరిలింగంపల్లి**

తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ పరిధిలో 27.05.2026 తేదీన ప్రత్యేక డీఎస్ఆర్ డ్రైవ్ నిర్వహించి, వాహనాలపై అనుమతి లేకుండా ఉపయోగిస్తున్న సైరన్లు, ఫ్లాష్ లైట్లు మరియు నిబంధనలకు విరుద్ధమైన నెంబర్ ప్లేట్లపై కఠిన చర్యలు తీసుకున్నారు. ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించడంతో పాటు రహదారి భద్రతను మెరుగుపరచడం ఈ డ్రైవ్ ముఖ్య ఉద్దేశ్యంగా నిర్వహించబడింది. ఈ ప్రత్యేక తనిఖీల్లో మొత్తం 587 కేసులు నమోదు చేయగా, రూ. 1,34,200 జరిమానాలు విధించబడినట్లు అధికారులు తెలిపారు. అనుమతి లేని సైరన్లకు సంబంధించి 8 కేసులు నమోదు చేసి రూ. 8,000 జరిమానా విధించగా, అనధికార ఫ్లాష్ లైట్ల వినియోగంపై 107 కేసులు నమోదు చేసి రూ. 26,600 జరిమానాలు విధించారు. అదేవిధంగా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నెంబర్ ప్లేట్లపై 472 కేసులు నమోదు చేసి రూ. 99,600 జరిమానాలు విధించారు. మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 1 సైరన్ కేసు నమోదు చేసి రూ. 1,000 జరిమానా విధించగా, రాయదుర్గం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2 సైరన్ కేసులు నమోదు చేసి రూ. 2,000 జరిమానా విధించారు. మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యధికంగా 5 సైరన్ కేసులు నమోదు చేసి రూ. 5,000 జరిమానా విధించారు. ఫ్లాష్ లైట్ల వినియోగంపై జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యధికంగా 25 కేసులు నమోదు చేసి రూ. 11,600 జరిమానా విధించగా, మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 37 కేసులు నమోదు చేసి రూ. 7,400 జరిమానా విధించారు. మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 16 కేసులు, గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 14 కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధమైన నెంబర్ ప్లేట్లపై కేపీహెచ్‌బీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యధికంగా 82 కేసులు నమోదు చేసి రూ. 16,400 జరిమానా విధించగా, మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 63 కేసులు, రాయదుర్గం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 57 కేసులు, నార్సింగి మరియు కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధుల్లో చెరో 43 కేసులు నమోదు చేశారు. గచ్చిబౌలి, జీడిమెట్ల, మియాపూర్, బాలానగర్, ఆర్సీ పురం, పటాన్‌చెరు, కొల్లూరు తదితర ప్రాంతాల్లో కూడా విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అధికారుల అనుమతి లేకుండా సైరన్లు, ప్రత్యేక లైట్లు వినియోగించడం చట్ట విరుద్ధమని, నెంబర్ ప్లేట్లు మోటార్ వాహన చట్టం ప్రకారం ఉండాలని ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు సూచించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగుతాయని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణానికి సహకరించాలని ప్రజలను కోరారు.

**DGP-TG Special DSR on 03 Violations on 27.05.2026**
**(Illegal Sirens, Lights and Number Plates)**

| Sl. No | Name of the PS | Sirens | | Lights | | Number Plates | |
|---|---|---|---|---|---|---|---|
| | | No.of Cases | Fine Amount | No.of Cases | Fine Amount | No.of Cases | Fine Amount |
| 1 | Madhapur Tr. PS | 1 | 1000 | 3 | 400 | 63 | 12600 |
| 2 | Raidurgam Tr. PS | 2 | 2000 | 2 | 300 | 57 | 11400 |
| 3 | Gachibowli Tr. PS | 0 | 0 | 14 | 2700 | 37 | 8600 |
| 4 | Narsingi Tr. PS | 0 | 0 | 2 | 300 | 43 | 12600 |
| 5 | Kolluru Tr. PS | 0 | 0 | 0 | 0 | 9 | 1800 |
| 6 | RC Puram Tr. PS | 0 | 0 | 0 | 0 | 26 | 5200 |
| 7 | Patancheruv Tr. PS | 0 | 0 | 3 | 600 | 4 | 800 |
| 8 | Miyapur Tr. PS | 5 | 5000 | 16 | 2300 | 36 | 7200 |
| 9 | KPHB Tr. PS | 0 | 0 | 1 | 300 | 82 | 16400 |
| 10 | Kukatpally Tr. PS | 0 | 0 | 1 | 100 | 43 | 8600 |
| 11 | Balanagar Tr. PS | 0 | 0 | 3 | 600 | 19 | 3800 |
| 12 | Jeedimetla Tr. PS | 0 | 0 | 25 | 11600 | 41 | 8200 |
| 13 | Medchal Tr. PS | 0 | 0 | 37 | 7400 | 12 | 2400 |
| Total | | 8 | 8000 | 107 | 26600 | 472 | 99600 |

# పేదల అభ్యున్నతి కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ

## ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ

**జనోదయ : డి. హీరేహాళ్ మే 27**

పేదల అభ్యున్నతి, గ్రామీణ అభివృద్ధి, సామాన్య ప్రజల సంక్షేమం లక్ష్యంగా ఆవిర్భవించిన పార్టీ అని అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ నియోజకవర్గ మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు రాయదుర్గం మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంత రెడ్డి,రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్లి రాజు, మండల పార్టీ కన్వీనర్ మోహన్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ మురిడి గంగాధర ఆధ్వర్యంలో రెండు రోజులపాటు మహానాడు పండుగ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాటు చేయడం జరిగినది ఇందులో భాగంగా ఈ మహానాడు కార్యక్రమాన్ని మండలంలోని హిర్దేహాలు ఆంజనేయ స్వామి కళ్యాణమండపం నందు ఈ మహానాడు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం



జరిగినది ఇందులో భాగంగా మొదటి రోజు ఈ మహానాడు కార్యక్రమాన్ని మండల మొత్తంగా ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు అభిమానుల మధ్య భారీ ఎత్తున ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, స్థానిక ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు తనయుడు యువ నాయకుడు కాల్వ భరత్ పాల్గొనడం జరిగినది మహానాడు కార్యక్రమంలో మాట్లాడిన టిడిపి నాయకులు పార్టీ స్థాపన నుంచి ప్రజా సేవే ధ్యేయంగా కొనసాగుతోందని అన్నారు.రాష్ట్ర అభివృద్ధికి రైతులు, మహిళలు, యువత, పేద కుటుంబాల సంక్షేమమే ప్రధాన బలమని పేర్కొంటూ, ప్రతి వర్గానికీ న్యాయం చేసే పాలన అందించడమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి గడపకు అభివృద్ధి ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు.పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో మరింత బలంగా ప్రజల్లోకి వెళ్లి సంక్షేమం మరియు అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నందు మాజీ కన్వీనర్ మాకాశి వెంకటేశు, మాజీ సర్పంచ్ రామాంజనేయులు, సీనియర్ నాయకులు నారాయణస్వామి, ఎంపీటీసీ మొండి మల్లికార్జున,తిప్పేస్వామి, శ్రీరాములు, నాగయ్య,యువ నాయకుడు గోవిందు, మరిస్వామి, గూళి,వెంకటేశు, తాయప్ప, వన్నూరు స్వామి, శంకర్, తదితరులు పాల్గొన్నారు

# నిన్న నగుబాటు... నేడు దిద్దుబాటు

## భద్రాచలం ఆసుపత్రి అధికారులతో పీఓ, ఎమ్మెల్యే సమీక్ష

**జనోదయ : ఉమ్మడి ఖమ్మం ప్రతినిధి**

ఇటీవల ఆరోపణలు, అవాంఛనీయ సంఘటనలతో మసకబారుతున్న భద్రాచలం ఏరియా ఆసుపత్రి పనితీరు చక్కదిద్దేందుకు ఐటీడీఏ పీఓ రాహుల్, స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు చర్యలు చేపట్టారు. ఈ మేరకు వారు బుధవారం ఏరియా ఆసుపత్రి వైద్యులు, వివిధ విభాగాల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. రెండురోజుల క్రితం ఈ ఆసుపత్రి నుంచి ఓ వ్యక్తి మృతదేహాన్ని భుజాలపై మోసుకుంటూ తీసుకెళ్లారనే ఆరోపణల నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక్కడ పరిస్థితులను సరిదిద్దేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగా నిర్వహించిన సమీక్ష సమావేశంలో పీఓ, ఎమ్మెల్యే సిబ్బందికి హితబోధ చేశారు. నాలుగు రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్న భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో పనిచేసే డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాద పూర్వకంగా ప్రవర్తించి వారికి సరైన వైద్య చికిత్సలు అందించాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుతో కలిసి ఐటీడీఏ పీఓ బి.రాహుల్ కోరారు. మంచి పేరున్న భద్రాచలం ఏరియా ఆసుపత్రికి ఈమధ్య చాలా ఫిర్యాదులు వస్తున్నాయని, ఇకముందు ఎటువంటి ఫిర్యాదులు రాకుండా డాక్టర్లు, సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఆసుపత్రిలో కాన్పు అయిన





వారి దగ్గర డబ్బులు అడుగుతున్నట్లు, ప్రైవేటులో పనిచేసే వారిని ఓపిలో కూర్చో పెట్టి పనులు చేయిస్తున్నట్లు, అలాగే బయట నుంచి వచ్చిన నర్సులు అక్కడున్న సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రస్తుతం ఏరియా ఆసుపత్రికి మెటీరియల్ కొనుగోలుకు రూ. 35 లక్షలు, పి. హెచ్.సి.లకు రూ. 10 లక్షల చొప్పున త్వరలో మంజూరవుతున్నాయని వెల్లడించారు. అవసరమైన మెటీరియల్ తీసుకొని పేషెంట్లకు అన్నిరకాల వైద్యపరీక్షలు చేయాలని కోరారు. డాక్టర్లు, సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తప్పనిసరిగా విధుల్లో ఉండాలని, విధులు అయిపోయిన తర్వాత కూడా ఏమైనా ఎమర్జెన్సీ ఫోన్ కాల్స్ వస్తే వెంటనే స్పందించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్య వైఖరి కనబరిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఐఏఎస్ అధికారుల కుటుంబ సభ్యులు కూడా నమ్మకంతో ఇక్కడే కాన్పులు చేయించుకున్నారనే పేరున్న ఆసుపత్రికి సిబ్బంది నిర్లక్ష్యం వల్ల చెడ్డ పేరు వచ్చే సూచనలున్నందున జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలన్నారు. డాక్టర్లు, స్టాఫ్ నర్సులు తాము చేసే ప్రతి పనీ రికార్డులో నమోదు చేయాలని, డాక్టర్లు పేషెంట్లను చూసి వెళ్లిపోయిన తర్వాత పేషంట్లతో ప్రేమగా వ్యవహరించాలని, పేషెంట్లకు వారికున్న జబ్బు గురించి కౌన్సిలింగ్ ఇచ్చి, సలహాలు, సూచనలు అందించాలన్నారు. డ్యూటీలో ఉన్న డాక్టర్లు, సిబ్బంది తప్పనిసరిగా యూనిఫాం మెయింటైన్ చేయాలన్నారు. శానిటేషన్ పరంగా జాగ్రత్తలు తీసుకుని, పేషెంట్లకు పేషెంట్లతో పాటు వచ్చిన అటెండర్లకు తప్పనిసరిగా ఆసుపత్రి మెనూ ప్రకారం ఉదయం అల్పాహారం మొదలుకుని రాత్రి భోజనం వరకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏరియా ఆసుపత్రిలో పనిచేసే డాక్టర్ల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు సమన్వయంతో పనిచేసి మంచి పేరు తీసుకుని రావాలన్నారు. కార్యక్రమంలో ఏడీఎంహెచ్ఓ సైదులు, డీసీహెచ్ రవిబాబు, ఆర్ఎంఓ డాక్టర్ రాజశేఖర్, డాక్టర్లు, హెడ్ నర్స్, జీఎన్ఎమ్, స్టాఫ్ నర్స్, తదితరులు పాల్గొన్నారు.